క్లుప్తంగా

కుమారస్వామికి విశేషపూజలు



శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం సందర్భంగా ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేష క్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

గండి పూడ్చివేత



జేసీబీతో మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని శివపురం గ్రామ శివారులో ఉన్న ఈర్ల చెరువుకు సోమవారం గండి పడిన విషయం విధితమే. స్పందించిన అధికారులు గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, గ్రామ పెద్దలు, రైతుల సమక్షంలో మంగళవారం జేసీబీతో గండిపడ్డచోట మరమ్మతులు చేయించారు. దీంతో చెరువు కింద ఉన్న ఆయకట్టు రైతులు తమ పొలాలు నీట మునిగే ప్రమాదం తప్పిందని ఆనందవ వ్యక్తం చేస్తున్నారు. అలాగే గత రెండేళ్ల క్రితం కిందట చెరువుకు పలుచోట్ల గండిపడడంతో అప్పట్లో కూడా పనులు చేయించారని తెలిపారు.

వృద్ధురాలికి తప్పిన ప్రమాదం

మహానంది: బొల్లవరం గ్రామానికి చెందిన తురగ చిన్నమ్మ నివాసం ఉంటున్న మట్టిమిద్దె పెచ్చులు ఊడి పడడంతో ప్రమాదం తప్పింది. సోమవారం రాత్రి ఆమె ఇంటిలో నిద్రిస్తుండగా మట్టిపెల్లలు విరిగిపడ్డాయి. దీంతో అప్రమత్తమైన ఆమె ప్రమాదాన్ని గుర్తించడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. విషయం తెలుసుకున్న వీఆర్వో చెలమయ్య ఆమె ఇంటి వద్దకు చేరుకుని వివరాలు సేకరించారు.

30.4 మి.మీ. వర్షపాతం నమోదు

పగిడ్యాల: తుపాన్ ప్రభావం వలన మంగళవారం మండలంలో 30.4 మి.మీ. వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌ఓ ఎల్లగౌడ్ తెలిపారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పంటలు నెల రోజులు కావస్తున్నందున రైతులు సస్య రక్షణ చర్యల్లో బిజీబిజీగా ఉన్నారు. మండలంలోని నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, పగిడ్యాల, లక్ష్మాపురం, తదితర గ్రామాల్లో వర్షాధారం కింద సాగైన మొక్కజొన్న పైర్లు కళకళలాడుతున్నాయి.

కొనసాగుతున్న వర్షాలు

జూపాడుబంగ్లా: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల మండలంలోని వివిధ గ్రామాల్లో గత ఆరు రోజుల నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన వర్షం 32.2మిల్లీమీటర్లుగా నమోదైనట్లు ఏఎస్‌ఓ హనుమంతు తెలిపారు. నియోజకవర్గంలోని పాములపాడు మండలంలో అత్యధికంగా 38.6మిల్లీమీటర్లు, అత్యల్పంగా మిడుతూరు మండలంలో 16.2 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసినట్లు తెలిపారు. నందికొట్కూరులో 32.4ఎం.ఎం, పగిడ్యాలలో 30.2ఎం.ఎం, కొత్తపల్లిలో 25.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వెల్లడించారు.

పందిరి వేస్తుండగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్

మహానంది: దేవస్థానం ప్రాంగణంలోని ఓ తాత్కాలిక దుకాణం వద్ద పందిరి ఏర్పాటు చేస్తుండగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ప్రమాదం తప్పిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఆర్యవైశ్య సత్రం ముందు భాగంలో దుకాణం నిర్వహించుకు వారు పందిరి వేసుకుంటుండగా పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ 11కేవీ జంపర్లకు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగింది. వెంటనే విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

'చలో విజయవాడ'ను జయప్రదం చేయండి

పాములపాడు: ఈ నెల 30న తలపెట్టిన చలో విజయవాడను జయప్రదం చేయాలని రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రైతు సంఘం కార్యాలయం వద్ద పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మోదీ దుష్పరిపాలన నుంచి రైతులను, శ్రామికులను కాపాడాలనే ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. విజయవాడ నగరంలోని సిద్ధార్థ పీజీ కళాశాల ఆడిటోరియంలో కార్యక్రమం జరుగునని తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం సీనియర్ నాయకులు రామేశ్వరరావు, స్వామన్న, రమణ, బాలఏసు పాల్గొన్నారు.

మయూర వనం.. తంగడంచ ఫారం

- నెమళ్లకు నివాసక్షేత్రంగా మారిన తంగడంచ విత్తనోత్పత్తిక్షేత్రం
- 150 వరకు ఉండవచ్చంటున్న అధికారులు
- ఉదయం, సాయంత్రం వేళల్లో వినసొంపైన అరుపులు
- నెమళ్ల సంరక్షణ కేంద్రంగా తీర్చిదిద్దాలంటున్న ప్రకృతి ప్రియులు



తంగడంచ ఫారంలో సంచరిస్తున్న నెమళ్లు



జూపాడుబంగ్లా: ముళ్లపొదలలు, పిచ్చిమొక్కలతో బీడుగా మారిన 285 ఎకరాల తంగడంచ ఫారం భూములు జాతీయపక్షి నెమళ్లకు నివాసక్షేత్రంగా మారాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో వాటి వినసొంపైన శబ్దాలు ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తున్నాయి. ఫారం భూముల్లో వాటి సంచారం అధికంగా ఉన్నందున ఫారాన్ని నెమలుల అభయారణ్యంగా తీర్చిదిద్దాలని ప్రకృతిప్రేమికులు కోరుతున్నారు.

అడవిని తలపిస్తున్న నిరుపయోగ భూమి

1616 ఎకరాల్లో తంగడంచ ఫారం భూములు విస్తరించి ఉన్నాయి. అందులో 624ఎకరాల భూములను జైన్ కంపెనీకి విక్రయించారు. 300ఎకరాల భూములను గుజరాత్ అంబుజా కంపెనీకి కేటాయించగా కంపెనీ స్థాపించకపోవటంతో ఆ భూములను ఏపీఐఐసీ వారు స్వాధీనం చేసుకున్నారు. 150 ఎకరాల్లో ఏపీఐఐసీ వారు స్మాల్‌స్కేల్ ఇండస్ట్రీలకు కేటాయించాలని రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీలు నిర్మించారు. మిగిలిన 150 ఎకరాల్లో కంపచెట్లు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. టీడీపీ పాలనలో సీడ్‌హబ్‌కు కేటాయించిన 624 ఎకరాల భూముల్లో 215ఎకరాలను ప్రభుత్వ అనుమతితో సాగుకు అనుకూలంగా మార్చారు. అందులో ఫారం అధికారులు విత్తనోత్పత్తి చేస్తుండగా మరో 285ఎకరాల మేర భూములు పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో నిండిపోయి చిన్నపాటి అడవిని తలపిస్తున్నాయి. ఈ భూముల్లో జనసంచారం లేకపోవటంతో పాటు నీటి లభ్యత ఉన్నందున ఆరేళ్ల క్రితం నెమలులు నివాసస్థావరంగా మార్చుకున్నాయి. గతంలో తక్కువగా ఉన్నప్పటికీ వాటి సంఖ్య ప్రస్తుతం 150కి చేరుకున్నట్లు ఫారం అధికారులు తెలిపారు.

ముళ్లపొదలే ఆవాసాలు

నాలుగేళ్ల క్రితం వేసవిలో నీటిలభ్యత లేకపోవటంతో ఎండల తీవ్రతకు అస్వస్థతకు గురై రెండు, మూడు నెమలులు పశువుల కాపరులకు చిక్కటంతో వాటిని పోలీసుల ద్వారా అటవిశాఖ అధికారులకు అప్పగించిన సందర్భాలున్నాయి. ముళ్లపొదలతో నిండిపోయి నెమలుల ఆవాసకేంద్రంగా మారిన తంగడంచ ఫారం భూములను నెమళ్ల అభయారణ్యంగా తీర్చిదిద్దటంతో పాటు జాతీయపక్షి సంతతి అంతరించి పోకుండా సంరక్షించాలని ప్రకృతి ప్రియులు కోరుతున్నారు.

ఫారం భూముల్లో నెమళ్లు స్థావరం ఏర్పాటు చేసుకున్నాయి



ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండి నిరుపయోగంగా ఉన్న ఫారం భూముల్లో వందల కొద్ది నెమళ్లు స్థావరం ఏర్పాటు చేసుకున్నాయి. అంతరించిపోతున్న జాతీయపక్షి సంతతిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈనేపథ్యంలో నిరుపయోగంగా ఉన్న ఫారం భూములను నెమలుల సంరక్షణ కేంద్రంగా తీర్చిదిద్దటంతో పాటు అంతరించిపోతున్న పక్షిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– రామాంజనేయనాయక్, అసిస్టెంటు డైరెక్టర్, పశుసంవర్ధకశాఖ



క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకునేందుకు క్యూలో నిలిచిన ప్రజలు

200 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు

కొత్తపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం వైద్యులు వినోద్‌కుమార్, దీపానాగవేణి, గోకవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు జుబేదా, విజయేంద్రల ఆధ్వర్యంలో 200 మందికి మొబైల్ ఎక్స్‌రే క్యాంపు ద్వారా క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కర్నూలు అశ్వినీ హాస్పిటల్, సేవా భారతి స్వచ్ఛంద సేవా సంస్థ, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సమన్వయంతో ఆత్మకూరు టీబీ యూనిట్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వీరికి రూ.400 విలువచేసే డిజిటల్ ఎక్స్‌రేని పీహెచ్‌సీల తరఫున ఉచితంగా తీయడం జరిగిందన్నారు. ఇందులో క్షయవ్యాధి నిర్ధారణ అయితే వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాలకృష్ణ, టీబీ సూపర్ వైజర్లు మస్తానయ్య, రవికుమార్, పీహెచ్‌ఎన్ అయేషా, సూపర్‌వైజర్లు దేవ కరుణమ్మ, సుంకమ్మ, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

బాధితుల ధ్రువపత్రాల పరిశీలన



రైతుల నుంచి ధ్రువ పత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

వెలుగోడు: మండలంలో 167కే కల్వకుర్తి–నంద్యాల జాతీయ రహదారి నిర్మాణంలో స్థిర, చర ఆస్తులు కోల్పోతున్న రైతులు, ప్రజల నుంచి భూహక్కు పత్రాలను పరిశీలించారు. మంగళవారం తహసీల్దార్ నారాయణరెడ్డి, అవార్డు ఎంక్వైరీ కమిటీ, నేషనల్ హైవే కమిటీ సమావేశం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ.. బోయరేవుల గ్రామంలో 142 మంది రైతులు 5.29 ఎకరాల భూమి జాతీయ రహదారి నిర్మాణంలో కోల్పోతున్నారు. మోతుకూరు గ్రామంలో 182 మంది రైతులు 6.30 ఎకరాల భూములు కోల్పోతున్నారని తెలిపారు. నేషనల్ హైవే డిప్యూటీ తహసీల్దార్ యూసుఫ్ మాట్లాడుతూ..నంద్యాల–కల్వకుర్తి జాతీయ రహదారి నిర్మాణంలో ఐదు మండలాల రైతులు భూములు కోల్పోతున్నారని చెప్పారు. మొత్తంగా 620.30 ఎకరాల భూమి రైతుల నుంచి సేకరించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా బోయరేవుల, మోతుకూరు గ్రామాల్లో భూములు కోల్పోతున్న రైతులు వాటికి సంబంధించిన 13 సంవత్సరాల ఈసీ, అడంగల్, ఆర్వోఆర్ (బీ), బ్యాంకు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, టైటిల్ డీడ్, దస్తావేజుల నకలు, వివిధ రకాల కట్టడాలకు సంబంధించిన నకళ్లను సమర్పించాలని తెలిపారు. ఐదు రోజుల వరకు తహసీల్దార్ కార్యాలయంలో సంబంధిత వీఆర్‌వోలు ధ్రువ పత్రాలు స్వీకరిస్తారని చెప్పారు.

మేతకు అనుమతించండి



డీఎఫ్‌ఓ అలాన్‌చోంగ్ టెరాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం నాయకులు

ఆత్మకూరు: వెలుగోడు మండలం గట్టుతండా గిరిజనులు అడవిలో గోవులను మేపేందుకు అనుమతించాలని ఏపీ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు రాజునాయక్ కోరారు. పట్టణంలోని డీఎఫ్‌ఓ కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో డీఎఫ్‌ఓ అలాన్‌చొంగ్ టెరాన్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల నుంచి గట్టుతండా వాసులు అటవీలో నివశిస్తూ గోవులను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. మేతకు తీసుకువెళ్తుంటే వెలుగోడు ఫారెస్ట్ అధికారులు కక్షగట్టి గోవులను అడవిలోకి వెళ్లనివ్వకుండా వెనక్కి పంపించడం సరికాదన్నారు. ఆవులు మేత లేక మృతి చెందే అవకాశం ఉందని, మూగజీవాలను కనికరించి మేతకు అనుమతించాలని కోరారు. అనంతరం డీఎఫ్‌ఓ కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గట్టుతండా నాయకులు సక్రూనాయక్, వెలుగోడు వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, నాగేష్‌నాయక్, సుబ్బయ్యనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ పిచ్చివాడిలా మాట్లాడుతున్నాడు

- సినిమాలు చూసి ఓటు వెయ్యరు
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



సీతారామాపురంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: వలంటీర్లు నిస్వార్థంగా సేవలు అందిస్తుంటే పవన్‌కల్యాణ్ పిచ్చిపట్టిన వాడిలా మాట్లాడుతున్నాడని ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీతారామాపురం గ్రామంలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వలంటీర్ల వ్యవస్థ లేకుండా చేస్తామని ముందుగానే ప్రకటించి పోటీ చేస్తామనే ధైర్యం ఉందా అంటూ, టీడీపీ అధినేత చంద్రబాబు,జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌లను ప్రశ్నించారు. గ్రామాల్లో అభివృద్ధి చూసి ఓటు వేయాలని గత శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఎప్పుడైనా మీ గ్రామాల్లోకి వచ్చారా.. అంటూ స్థానికులను ప్రశ్నించారు. సినిమాల్లో నటించే పవన్‌కల్యాణ్‌కు రాజకీయాలు అంటే సినిమాలా ఉందని, రెండున్నర గంటల సమయం సినిమా రాజకీయాలను ప్రభావితం చేయలేవని గుర్తు చేశారు. ప్రస్తుతం పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, సర్పంచ్ బుడ్డారెడ్డి తేజస్విని, జెడ్పీటీసీ మహేశ్వరరెడ్డి, కన్వీనర్ కొమ్ము మహేశ్వరరెడ్డి, మండల సీనియర్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి,భాస్కర్‌రెడ్డి,కొండా మధుసూధన్‌రెడ్డి,గజ్జపకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను మోసం చేసిన ఘనత చంద్రబాబుదే

అన్ని వర్గాల వారికి హామీలు ఇచ్చి మోసం చేసిన ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని ఎమ్మెల్యేశిల్పాచక్రపాణిరెడ్డి మండిపడ్డారు. బండిఆత్మకూరు మండలం నారాయణపురం, చిన్నదేవులాపురం సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లో లంచాలకు తావు లేకుండా మధ్యవర్తులతో ప్రమేయం లేకుండా , అవినీతి రహిత పాలన అందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో బండిఆత్మకూరు ఎంపీపీ సంజీవరెడ్డి, ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ పుల్లారెడ్డి, సింగల్‌విండో చైర్మన్ శివలింగం , మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ విక్రమసింహా నాయక్, సర్పంచ్ మధుసూదన్ చౌదరి, నాయకులు సరిత, , శివన్న, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెలుగోడులో ఎమ్మెల్యేను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అవినీతి రహిత పాలన

ఆత్మకూరు: రాష్ట్రంలో అవినీతి పాలన అందిస్తున్న ఏకై క ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ శిల్పా భువనేశ్వరరెడ్డి, పట్టణ మండల,పార్టీ అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, సర్పంచ్‌లు నాగులు నాయక్, వెంకటరమణ, ఎంపీటీసీ లక్ష్మీబాయి, శివశంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వెలుగోడు: పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 4వ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష గ్రామ సభ నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ధ్రువపత్రాలను పంపిణీ చేశారు.సురక్ష క్యాంపు 906 దరఖాస్తులు అందగా వాటిలో 905 అక్కడికక్కడే పరిష్కరించి మిగిలిన ఒక్క దరఖాస్తును రెండు రోజుల్లో పరిష్కరించేలా చర్య లు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు.

ఆర్‌బీకే నూతన భవనం ప్రారంభం

పట్టణంలోని 3వ రైతు భరోసా కేంద్రం నూతన భవనాన్ని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రారంభించారు. ఆర్‌బీకేలో ఏర్పాటు చేసిన మిషన్లను, యంత్రాలను పరిశీలించారు. రైతులు ఆర్‌బీకే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇటీవల ఎథిక్స్ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన ఎమ్మెల్యేను స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ అమీరున్‌బీ, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ జయపాల్, ఏపీసీపీడీసీఎల్ రీజినల్ కో–ఆర్డినేటర్ శశికళారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొరపాట్లకు తావివ్వకుండా ఓటరుజాబితా



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో దాసు

నందికొట్కూరు రూరల్ : పొరపాట్లకు తావివ్వకుండా ఓటర్ల జాబితా తయారు చేయడానికి రాజకీయ పార్టీల పాత్ర కూడా ముఖ్యమని ఆత్మకూరు ఆర్డీవో దాసు అన్నారు. మంగళవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడు నెలల పాటు ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితాలోని వ్యక్తులు ఉన్నారా లేదా? అని పరిశీలిస్తరన్నారు. ఏవైనా మార్పులు–చేర్పులు, సవరణలు సైతం చేసుకోవచ్చని, దీనికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. సమావేశంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎన్నికల డీటీ కిషోర్, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పాఠశాలల బంద్ ప్రశాంతం

జూపాడుబంగ్లా: విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ మంగళవారం మండల కేంద్రమైన జూపాడుబంగ్లాలోని ఉన్న త పాఠశాల, మోడల్‌స్కూళ్లను విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం చర్యలు తీసుకొని విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. నాయకులు వీరేంద్ర, వినోద్, రాజు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కొత్తపల్లి: మండలంలోని గోకులం షెడ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 116 మంది రైతులు గోకులం షెడ్లు నిర్మించుకున్నారని, వారికి ఏళ్లు గడిచిన బిల్లులు రాలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లబ్ధిదారులు నిర్మించుకున్న నిర్మాణాలకు బిల్లులు చేసేందుకు ఉత్తర్వులు ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో కొంతమంది దళారులు మేము బిల్లులు తెప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసేందుకు పూనుకున్నారని తన దృష్టికి వచ్చిందన్నారు. లబ్ధిదారులు అటువంటి వారిని నమ్మవద్దని చెప్పారు. లబ్ధిదారులకు అధికారులే బిల్లులు చేస్తారన్నారు. నేరుగా బ్యాంకుఖాతాలో నగదు జమ అవుతాయన్నారు.



లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి



పారుమంచాలలో ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి



శివపురంలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న దృశ్యం

జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి

నందికొట్కూరు: జగనన్న సురక్షతో అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని నంద్యాల రోడ్డులోని ఫంక్షన్ హాల్‌లో 14వ సచివాలయానికి సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు సమీరా బాను, అశోక్, శాంతకుమారి లబ్ధిదారులకు హాజరై ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి శ్యామలాదేవి, మున్సిపల్ ఆర్.ఐ విక్రమ్, జేసీఎస్ కన్వీనర్ అబుబక్కర్, నాయకులు ఉస్మాన్‌బేగ్, పీ.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాములపాడు: మండలంలోని జూటూరు గ్రామంలో గోపీకృష్ణ, వేంపెంట గ్రామంలో తహసీల్దార్ రత్నరాధిక జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. జూటూరులో 162 మందికి, వేంపెంటలో 312 మందికి ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. సర్పంచులు నాయిని సావిత్రమ్మ, మాణిక్యమ్మ, వైస్ ఎంపీపీ–2 వరలక్ష్మి, నాయకులు మద్దిలేటి, మధుసూదన్‌రావు, అంబయ్య తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు రూరల్ : మండలంలోని శాతనకోట గ్రామంలో అధికారులు, నాయకులు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ జనార్దన్‌గౌడ్ లబ్ధిదారులకు ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, ఎంపీడీవో శోభారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు పబ్బతి రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే 'జగనన్న సురక్ష'

జూపాడుబంగ్లా: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 'జగనన్న సురక్ష' కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు జెడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం పారుమంచాల ప్రాథమిక పాఠశాల ఆవరణలో సర్పంచ్ మాధవరం ప్రకాశం అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన 900మందికి సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్య యాదవ్, ఎంపీడీఓ సుబ్రమణ్యశర్మ, జగనన్న సురక్ష ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, సొసైటీ చైర్మన్ నారాయణరెడ్డి, హేమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండల పరిధిలోని శివపురం గ్రామంలో సర్పంచు చంద్రశేఖర్ యాదవ్ అధ్యక్షతన ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్‌లు జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ సోమల సుధాకర్ రెడ్డి, నాగంపల్లి సొసైటీ చైర్మన్ జనార్దన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై 403 ధ్రువపత్రాలు లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ శివన్న, కో–ఆప్టెడ్ సభ్యుడు మహమ్మద్ గౌస్, డిప్యూటీ తహసీల్దార్ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

మిడుతూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ప్రజలకు 11 రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా అందిస్తున్నారని జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అలగనూరు, జలకనూరు గ్రామ సచివాలయాల పరిధిలో ఎంపీడీఓ జీఎన్‌ఎస్ రెడ్డి, తహసీల్దార్ ప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌లు రామస్వామిరెడ్డి, కృష్ణవేణి, కురువ ఎల్లయ్య , ఎంపీటీసీ గుండం హరిసర్వోతమ రెడ్డి, సురక్ష మండల ఇన్‌చార్జ్ రవికుమార్, నాయకులు డీసీ నాగిరెడ్డి, రామచంద్రారెడ్డి, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జలకనూరులో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ పర్వత యుగంధర్‌రెడ్డి

ముగిసిన జగనన్న సురక్ష కార్యక్రమం

పగిడ్యాల: మండలంలో చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం మంగవారంతో ముగిసింది. చివరి రోజున లక్ష్మాపురం సచివాలయం– 1 లో సర్పంచ్ సుజాత అధ్యక్షతన ఎంపీడీఓ వెంకటరమణ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టారు. 609 మందికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగేంద్రయ్య, డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఏఈలు శివకుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కొలువుదీరిన పీర్లు



గాజులపల్లెలో కొలువైన పీర్ల స్వాములు

మహానంది: మొహర్రం వేడుకల సందర్భంగా మహానంది మండలంలోని వివిధ గ్రామాల్లో మఖానాల్లో పీర్లస్వాములు కొలువయ్యారు. మండల కేంద్రం తిమ్మాపురం , గాజులపల్లె, బుక్కాపురం బొల్లవరం, నందిపల్లె, తమ్మడపల్లె గ్రామాల్లో వేడుకలకు పీర్ల చావిళ్లను ముస్తాబు చేశారు. ఈ నెల 26 న చిన్నసరిగెత్తు తో వేడుకలు ప్రారంభమై 29న ముగియనున్నట్లు వివిధ గ్రామాల ముజావర్లు తెలిపారు.

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు ఉప్పలదడియ, మాసపేట, తిమ్మాపురం, 49– బన్నూరు , చౌట్కూరు తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ప్రారంభమయ్యాయి. మత సామరస్యానికి అతీతంగా జరుపుకునే వేడుకలలో భాగంగా పీర్లచావిళ్లలో పీర్లు కొలువుదీర్చారు. పీర్ల చావిడిలకు రంగులు వేసి, విద్యుద్దీపాలంకరణలతో ప్రత్యేకంగా అలంకరించారు.

ప్రపంచం తలదించుకునేలా మణిపూర్ ఘటనలు



సున్నిపెంటలో పీఎం మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం, సీఐటీయూ నాయకులు

పాములపాడు: మణిపూర్‌లో జరుగుతున్న ఘ టనలు యావత్‌ప్రపంచం తల దించుకునేలా ఉన్నాయని సీపీఎం సీనియర్ నాయకులు నా మేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని బస్టాండ్ సెంటరులో కళ్లకు నల్ల గుడ్డలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కుకీ మహిళలను వివస్త్ర ను చేసి రహదారిలో నడిపించి సామూహిక అత్యాచారాలు చేయడాన్ని చూస్తుంటే దేశం ఎక్కడికి పోతోందని ఆందోళన కలుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల కా ర్యదర్శి స్వామన్న, జిల్లా నాయకులు రణధీర్, ఆవాజ్ కమిటీ నాయకులు సోడాబాషా, సేవాభారతి షర్ఫుద్దీన్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంప్రాజెక్ట్: మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం స్పందించక పోవడంపై మంగళవారం సీపీయం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. మంగళవారం బస్టాండ్‌సెంటర్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్రప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు దర్శనం నాగరాజు, ఎమ్ చిన్నమారెన్న, నాగసైదయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరు: భూములు అడిగితే నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి చంపేయడం ఎంత వరకూ సమంజసమని మాలమహానాడు నియోజకవర్గ అధ్యక్షులు పబ్బతి శివకుమార్ ప్రశ్నించారు. మంగళవారం పట్టణంలోని మాలమహానాడు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అవలంభిస్తున్న విధానాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు నాగన్న, నాగేంద్ర, అయ్యన్న, విల్సన్, డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.